క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



కేటీదొడ్డి: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సర్పంచ్ మాధవి అన్నారు. మండలంలోని ఇర్కిచేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ సొంత ఖర్చులతో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, ఇతర సామగ్రిని శనివారం అందించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎలీషా, పల్లయ్య, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ గోవిందు శనివారం ప్రకటనలో తెలిపారు. అయిజ సబ్‌స్టేషన్ 132/33 కేవీ నుంచి గట్టు ఫీడర్ 33 కేవీ లైన్‌కు చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో వాటిని తొలగించేందుకు ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గట్టు, ఆలూరుకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

కేటీదొడ్డి: విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు భోజనం అందించాలని ఎంఈఓ సురేష్ అన్నారు. శనివారం మండలంలోని ఈర్లబండ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యా బోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఆర్‌పీలు యుగంధర్, పాపయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్నేహపూర్వక వాతావరణంలో పోటీలు

గట్టు: క్రికెట్ పోటీలను స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని సర్పంచ్ హనుమంతునాయుడు కోరారు. శనివారం బల్గెరలో దిగంబరస్వామి జాతర సందర్భంగా నిర్వహించే ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లకు సంబంధించిన టీ షర్టులను విడుదల చేసి, క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో కిష్టప్ప, రమేష్, బాస్‌నాయుడు, రాజు, బాసు గోపాల్, గట్టు సాయి, రామకృష్ణ, తిమ్మప్ప, రాజగోపాల్, సద్దాం పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

అయిజ: పట్టణంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకుడు రాముడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రో వాలీబాల్ ప్రీమియర్ లీగ్‌ను బీఆర్‌ఎస్ నాయకుడు అజయ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ రూ.15వేలు, తృతీయ బహుమతి రూ. 10 వేలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయాల్లో పూజలు

మల్దకల్: మండలంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లె కిష్టస్వామి, అమరవాయి వీరభద్రస్వామి, శేషంపల్లి శివ సీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదిశిలాక్షేత్రం, సద్దలోనిపల్లె ఆలయాల్లో భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై ప్రారంభించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అయిజ: మండలంలోని ఉప్పలలో వాల్మీకి ఆలయం నిర్మించేందుకు బీఆర్‌ఎస్ నాయకుడు రాముడు శనివారం ఆయన నివాసంలో వాల్మీకి సంఘం నాయకులకు రూ. 50 వేలు విరాళం అందజేశారు. వాల్మీకి మహర్షి రామాయణాన్ని రాసి ఆదర్శంగా నిలిచారని, ఆయన చరిత్రను భావితరాలకు తెలపాలన్నారు.

రేపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ధరూరు: మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జబ్బార్ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

వాసవీక్లబ్ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు హనుమంతయ్య

గద్వాల: పట్టణ వాసవీ క్లబ్ కార్యవర్గాన్ని శనివారం స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరహరి హనుమంతయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీహరి, కోశాధికారిగా అశోక్ ఎన్నికయ్యారు. కార్యవర్గానికి జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

ఇంకెన్నాళ్లు కరెంట్ కష్టాలు!

- నాలుగేళ్లు దాటినా పూర్తికాని సబ్‌స్టేషన్
- ఇబ్బందులు పడుతున్న మూడు గ్రామాల ప్రజలు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు



పచ్చర్లలో అసంపూర్తిగా ఉన్న సబ్‌స్టేషన్ పనులు

రాజోళి: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం.. వెరసి మూడు గ్రామాలకు కరెంటు కష్టాలు తప్పడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. ఆచరణలో మాత్రం అది కనిపించడం లేదు. మూడు గ్రామాలకు విద్యుత్ అందించేందుకు నిర్మించ తలపెట్టిన సబ్‌స్టేషన్ నాలుగేళ్లు దాటినా పూర్తి కాలేదు.

మండలంలోని పచ్చర్లలో నిర్మిస్తున్న 33/11కేవీ సబ్ స్టేషన్ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్ నిర్మాణంతో విద్యుత్ అంతరాయం తగ్గుతుందని, వ్యవసాయ పనులకు అడ్డంకులు లేకుండా నిరంతర కరెంట్ సరఫరా అవుతుందనుకుంటే ఆ కల నెరవేరడం లేదు.

మూడు గ్రామాల కోసం..

పచ్చర్లలో నిర్మిస్తున్న ఈ సబ్ స్టేషన్ ద్వారా పచ్చర్ల, తనగల, తుమ్మిళ్లకు ఫీడర్ల ద్వారా విద్యుత్ అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. దాని కోసం గ్రామస్తుల తీర్మానంతో స్థానికంగా ఉన్న సర్వే నంబర్ 24 నుంచి ఎకరా భూమిని కేటాయించారు. ఈ



వృథాగా మెటీరియల్

సబ్‌స్టేషన్‌ను 2017 అక్టోబర్ 22న అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు భూమి పూజ చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నేటి వరకు పనులు పూర్తి కాకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు కొన్ని నెలలు ప్రారంభం కాకపోగా, ఆ తర్వాతి కొద్ది నెలలకు విద్యుత్ స్తంభాలు, మెటీరియల్ తీసుకువచ్చారు. మిషన్ భగీరథ పనుల వల్ల పనులు సాగడం లేదని సాకు చెప్పి అధికారులు పనుల్లో కదలిక తీసుకురాలేదని ప్రజలు అంటున్నారు. ఇలా ఎన్నో సాకులతో అధికారులు సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేయలేకపోతున్నారు. ఏటా ఈ సంవత్సరం సబ్ స్టేషన్ నుంచి కరెంట్ అందుతుందని ఆశించిన రైతులకు, ప్రజలకు ఏళ్ల తరబడి నిరాశే మిగులుతుంది. ప్రస్తుతం కూడా మెటీరియల్ అందుబాటులో లేకపోవడంతోనే పనులు నిలిచాయని అధికారులు అంటున్నారు.

ఎదురు చూస్తున్నాం



పచ్చర్లలో సబ్ స్టేషన్‌కు భూమి పూజ చేసి నాలుగేళ్లు గడిచింది. భూమి పూజ సమయంలో ఆనందపడ్డాం. ఇంతవరకు పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. సబ్ స్టేషన్ పూర్తితో పలు గ్రామాల్లో కరెంట్ కష్టాలు తీరుతాయనుకుంటే పూర్తి కాకపోవడం బాధాకరం. – తిరుమల్ రెడ్డి, సర్పంచ్, పచ్చర్ల

మెటీరియల్ రాగానే ప్రారంభిస్తాం

సబ్‌స్టేషన్‌కు అవసరమయ్యే కొంత మెటీరియల్ లేక పనులు నెమ్మదించాయి. ఈ బడ్జెట్‌లో మంజూరు రాగానే పనులు ప్రారంభిస్తాం. గ్రామాల్లో కరెంట్ కష్టాలు తీర్చే ఈ సబ్ స్టేషన్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం.

– సుబ్బారాయుడు, ట్రాన్స్‌కో ఏఈ

బహుజనులంటే చిన్నచూపెందుకు?



ఆరగిద్దలో కుండలు చేస్తున్న రంజిత్‌కుమార్

గట్టు: పాలకులకు బహుజనులంటే చిన్న చూపు చూస్తున్నారని, నడిగడ్డలో బహుజన రాజ్యం రావాలంటే అందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్ర శనివారం ఆలూరు, పెంచికలపాడు, ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి, తప్పెట్లమొర్సు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజన ప్రజలందరిని ఐక్యమత్యం చేయడానికి నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా ముందుండి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. నడిగడ్డలో సరైన విద్య, వైద్యం, అభివృద్ధి లేక వెనుకబాటుకు గురైనట్లు ఆరోపించారు. సంక్షేమం అభివృద్ధికై మా పోరాటం నిర్వహిస్తామని, రాబోయే రోజుల్లో బహుజన రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద వర్గాల తరపున బహుజన నాయకత్వాన్ని నిలబెట్టడడం కోసం ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. బహుజనులంటే బంగ్లా, బండ్లకు ఎందుకింత చిన్న చూపు చూస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో గద్వాల కోటపై బహుజనుల జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, లవన్న, బలరాం, దయాకర్, వెంకట్రాములు జమ్మన్న, అవనీశ్రీ, రంగస్వామి పాల్గొన్నారు.

సిద్దన్‌పల్లిలో ఫీవర్ సర్వే



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య బృందం

కేటీదొడ్డి: గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రోగాలు రావని జిల్లా మలేరియా అధికారి రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని సిద్దన్‌పల్లిలో మలేరియా బృందం ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వేపై తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి దోమల స్ప్రే చేశారు. ప్రతి ఒక్కరూ దోమల తెర వాడాలని, నిల్వ నీటిని ఉంచకుండా శుభ్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివన్న, కృష్ణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీలకు క్షమాపణ చెప్పాలి

అలంపూర్: అంగన్‌వాడీ టీచర్ల మనోభావాలు దెబ్బతినేలా చిత్రీకరించిన సన్నివేశాన్ని వెంటనే తొలగించి, క్షమాపణ చెప్పాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో దసరా సినిమాలో అంగన్‌వాడీలను కించపరుస్తూ తీసిన సీన్‌ను తొలగించాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ శనివారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. దసరా సినిమాలో అంగన్‌వాడీ టీచర్‌గా క్యారెక్టర్ చేసిన హీరోయిన్ కొంగులో కోడిగుడ్లు దాచుకొని దొంగతనం చేసినట్లు ఉన్న సన్నివేశం టీచర్లను కించపరిచే విధంగా ఉందన్నారు. ఆ సన్నివేశాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమేలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు

బాధిత కుటుంబానికి మాజీ ఎంపీ పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

అలంపూర్: ఇటిక్యాల మాజీ జెడ్పీటీసీ ఖగునాథ్‌రెడ్డి గత నెల 23న గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, సంగాల అయ్యపురెడ్డి ఖగునాథ్‌రెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన మృతి ఈ ప్రాంతానికి తీరని లోటన్నారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని పూజలు



ఆదిశిలాక్షేత్రంలో పూజలు చేస్తున్న నెట్టెంపాడు గ్రామస్తులు

మల్దకల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలని, అలాగే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మరోసారి ఎమ్మెల్యే కావాలని కోరుతూ ధరూరు మండలం నెట్టెంపాడు గ్రామస్తులు పాదయాత్రగా వచ్చి శనివారం ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేశారు. వీరితో పాటు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆలయం వద్దకు చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో వివిధ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, ముఖ్యంగా రైతులకు మేలు చేసే పథకాలు ఏ ప్రభుత్వము చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, వెంకట్రామిరెడ్డి, యాకోబు, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

గద్వాల అర్బన్: ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి అధికారికంగా నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి శ్వేతా ప్రియదర్శిని శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాల పరిశీలన

ఉండవెల్లి: మండలంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం ఎంఈఓ శివప్రసాద్ పరిశీలించారు. మండల కేంద్రంలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేయగా, మైనార్టీ గురుకులలో 160 మంది, జెడ్పీహెచ్‌ఎస్‌లో 135 మంది, ప్రాథమికోన్నత పాఠశాలలో 129 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శివప్రసాద్

మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తా



అలంపూర్‌చౌరస్తాలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

అలంపూర్: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. అలంపూర్‌చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మానవపాడు మండల ముస్లిం మైనార్టీ నాయకులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. మానవపాడు మండల కేంద్రంలో ఉన్న మసీద్‌లో సీసీ బెడ్ నిర్మించాలని కోరారు. ఇందుకు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని వారు తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పైలమాన్, వెంకట్రాముడు, రఫీక్, అహ్మద్, మహబుబ్‌బాష, చాంద్, హర్షద్, ఖాజాబాష, మాలిక్ బాష తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

శాంతినగర్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. వడ్డేపల్లి మండలంలోని తనగలలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన పశుబలప్రదర్శన పోటీలను శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో వ్యవసాయం దండగ అనే పరిస్థితి ఉండేది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం పండగలా మారిందన్నారు.

అయిజ: రాష్ట్రకోసం సీఎం కేసీఆర్ అప్పట్లో తన ప్రాణాలను ఫణంగా పెట్టాడని, ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శనివారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా ఆడపిల్లల పెళ్లిలు చేసిన తల్లిదండ్రులకు రూ. 1,00,116 అందజేస్తున్నారని, రైతుబంధు పథకం ద్వారా ఎకరాకు రూ.10 వేలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.325 కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. అలంపూర్‌లో 100 పడకల ఆస్పత్రి, అయిజలో 30 పడకల ఆస్పత్రి, అన్ని మండలాల్లో పల్లె దవఖానాలను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

సివిల్ సప్లయ్ గోదాం పరిశీలన

అలంపూర్: పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాంను తహసీల్దార్ సుభాష్ నాయుడు శనివారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సందర్శించినట్లు తహసీల్దార్ తెలిపారు. గోదాంలో నిల్వ ఉన్న రేషన్ బియ్యం, రికార్డులను చూశారు. రికార్డుల్లో ఉన్న మేరకు బియ్యం ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. పాత స్టాక్ ఎక్కువగా ఉండటంతో వాటిని తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గోదాంలో రేషన్ బియ్యంను భద్రంగా ఉండే విధంగా చూడాలని సూచించారు.



అలంపూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభాష్‌నాయుడు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



బిజ్వారంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కమలాదేవి



ఆలూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్

మల్దకల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్య వంతంగా ఉంటారని సీడీపీఓ కమలాదేవి సూచించారు. శనివారం బిజ్వారం, మల్దకల్ గ్రామాల్లో పోషణపక్షంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల కలిగే లాభాలను తెలియజేశారు.

చిరుధాన్యాలపై అవగాహన

గట్టు: పోషణ పక్షంలో భాగంగా శనివారం ఆలూరు 4వ అంగన్‌వాడీ కేంద్రంలో చిరు ధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ ఇందిర మాట్లాడుతూ ప్రతి రోజు మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

అనర్హత వేటు వేయడం తగదు

గద్వాల అర్బన్: రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామిక చర్య అని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కృష్ణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షాలు లేకుండా చేయాలనే ప్లాన్ ప్రకారమే మోడీ ప్రభుత్వం ఈ చర్యకు పూనుకున్నదని ఆరోపించారు. వెంటనే అనర్హత వేటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్తీక్, హలీమ్‌పాష, హరీష్, శ్రీనివాసులు, అంజి, ఆశోక్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కృష్ణ

నీటి సమస్య తీర్చిన ఉపాధ్యాయుడు




ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈఓ సురేష్

కేటీదొడ్డి: మండలంలోని ఈర్లబండ ప్రాథమిక పాఠశాలలో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది గమనించిన అదే పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు అమీర్‌మియ్యా తన సొంతంగా రూ.50వేలతో బోర్ వేయించి మోటారు ఏర్పాటు చేశారు. దీంతో శనివారం ఎంఈఓ సురేష్ ఆయనను శాలువతో సన్మానించి అభినందించారు. అనంతరం కొండాపురం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అమీర్‌మియ్యా ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు.

నారాయణపురంలో 2వ ఆరాధన

ఉండవెల్లి: మానవపాడులో మండలంలోని నారాయణపురంలో దివంగత బాలయోగి శివ నారాయణ స్వామి 2వ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఆలయంలో రమా సహిత సత్యనారాయణ స్వామికి కల్యాణోత్సవం చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.



దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మానవపాడు మండలంలోని కలుకుంట్ల దత్తాత్రేయ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష అర్చన, గురుపూజ, హోమాలు, ప్రత్యేక భజనల్లో భక్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన సంకల్పం

- ఇంటింటా చెత్తసేకరణకు పెరుగుతున్న ప్రజల భాగస్వామ్యం
- అధికారుల పర్యవేక్షణతో గ్రామాల్లో స్వచ్ఛత

మల్దకల్: గ్రామాలలో స్వచ్ఛ సంకల్పం పటిష్టంగా అమలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్మికులు ప్రతి రోజు గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. సేకరించిన చెత్తను పంచాయతీ ట్రాక్టర్లతో డంపింగ్‌యార్డుకు తరలిస్తూ స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇంటింటికీ చెత్తసేకరణలో భాగంగా ప్రజల భాగస్వామ్యం పెరగడంతో ఇళ్ల వద్దకు వచ్చే వాహనాలలో ప్రజలు తమ ఇంటి నుంచి తెచ్చిన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లలో వేసి స్వచ్ఛగ్రామాలలో భాగస్వాములవుతున్నారు. గతంతో పోలిస్తే ప్రజల భాగస్వామ్యం పెరగడంతో స్వచ్ఛ గ్రామాలుగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక పారిశుద్ధ్య కార్మికుడిని పంచాయతీలలో నియమించగా ప్రతి ఒకరికి నెలకు గౌరవ వేతనంను పంచాయతీ ద్వారా అందిస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలలో పర్యటిస్తూ పారిశుద్ధ్య పనులతో పాటు డ్రెయినేజీల నిర్మాణాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



అమరవాయిలో చెత్తను సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

చెత్తసేకరణపై ప్రత్యేక శ్రద్ధ



గ్రామంలో చెత్తను తొలగించి పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కార్మికులు ప్రతి రోజు చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తూ, గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించి తడి, పొడి చెత్తలను వేరు చేస్తున్నాం. – సరిత, పంచాయతీ కార్యదర్శి, మంగంపేట

గ్రామాల్లో పక్కాగా అమలవుతుంది



గ్రామాలలో చెత్తసేకరణ పక్కాగా అమలవుతుంది. పంచాయతీ కార్మికులు చెత్తను సేకరిస్తున్నారు. ప్రతిరోజు గ్రామ పరిసరాలను పంచాయతీ కార్మికులు శుభ్రం చేయడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో శుభ్రత నెలకొంది. దీంతో గ్రామ ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు ఎంతో దోహదపడుతుంది.

– ఈదన్న, పాల్వాయి

పారిశుద్ధ్యంపై చర్యలు



గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. దీనికి సంబంధించి పంచాయతీ సిబ్బందితో ఎప్పటికప్పుడు చర్చించి పరిసరాల పరిశుభ్రతకు పాటు పడుతున్నాం. కార్యదర్శులు పారిశుద్ధ్య కార్మికులపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. – కృష్ణయ్య, ఎంపీడీఓ, మల్దకల్